# మేఘదూతము

035,1D40
N58

55568

వేంకటసుబ్రహ్మణ్యము

55568

# మేఘదూతము

R.S. VIDYAPEETHA LIBRARY
55568
TIRUPATI

కాళిదాసకృతికి
ఆంధ్రానువాదము

గుఱ్ఱము వేంకట సుబ్రహ్మణ్యము, బి. ఏ., బి. ఎల్.,

సాహితీ సమితి : రేపల్లె

*

## ఏతత్కవి కృతులు

ఋతుసంహారము

అమరు కావ్యము

ఇందుమతీపరిణయము

అభిజ్ఞానశాకుంతలము

55568
035,1D40
N58

S.V. VIDYAPEETHA LIBRARY
55568
TIRUPATI

ముద్రణము కానున్నవి :

రఘువంశము

భర్తృహరి

ఋతుమంగళము

రామాయణము (వచనము)

035,1D40
N58

*

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి

ప్రథమ ముద్రణము 1958

మూల్యము రూపాయి

*

# సమర్పణము.

సాహిత్యాచార్యులు

కవివతంసులు

స్వామి శివశంకరశాస్త్రిగారికి.

★

కవికులగురువుల కృతి యిది
తవిలి తెలుఁగు సేసి నేను ధన్యత గంటిన్;
కవికులగురు వగు మీ కీఁ
దవు నని మీ కేల దీనిఁ దవిలిచినాడన్.

★

# పీఠిక

కాళిదాసు రచనలలో 'మేఘదూతము' చిన్నదైనను విశ్వజనీనమైనది. దేశకాలములతో నిమిత్తములేక, భారత సాంప్రదాయమునకు దూరస్థులైన ఖండాంతరవాసులును మిక్కిలిగా మెచ్చుకొన్నట్టిది. దీనికి కారణము లేకపోలేదు. కావ్యవస్తువు ప్రియావిరహము. స్త్రీపుంస యోగవియోగములు విశ్వవ్యాప్తములు. నాయకుడు నాగరకుడు. అందువలన భావానుభూతికి చక్కగా ఆస్పదమైనవాడు. నాయిక పరకీయ గాక స్వీయ. అందువలన ప్రేమకు ఆవేగమునందును ఒక కుదురుపాటు కలదు. ధర్మమునకు వెలిగాదు. వియోగమును నిరవధికముగాదు. ఋతువలయమొకటి గడచుసరికి తీఱునట్టిది. నాగరక జీవనము, పడుచుదనము, అనుకూల దాంపత్యము, ప్రణయాతిశయము నేర్పడియున్న సన్నివేశములో సంభవించిన పరిమితమైన యెడబాటు కలిగించు హృదయ స్పందనము సరళముగా నెవరికైనను అందుకోలునకు సాధ్యమైనది. అట్టి భావచిత్రణము సామాన్యుల చేతిలో నాజూకుదనముతోనే ఆగిపోవచ్చును. లోకోత్తర ప్రతిభాశాలియైన కవి శిల్పమువలన ఆ స్పందనము చేతనాచేతనములను ఆవేశించినది. కామార్తుడైన యక్షుడు అచేతనమైన ఒక్క మేఘమునకే గాదు చైతన్యము నాపాదించినది. గిరి నదీ కానన నగర జాతమునకంతకును ప్రాణము పోసినాడు. మేఘుడొక శృంగార నాయకుడుగా తీఱినాడు. మార్గమంతయు నాతనికొక ప్రణయ విహారము. కొండలు దొడ్డనెయ్యురు. నదులు ఆర్ద్రాంతరలైన లలనలు. మేఘుడొక పరోపకారజీవి. ఇవేవో ఉత్ప్రేక్షలుగనో రూపకములుగనో అలంకార విశేషములుగా నిలిచిపోవు. యక్షునితో మనకు తొలుతనే కల్గిన తాదాత్మ్యము వలన సాక్షాత్తు చేతన మూర్తులుగానే హృదయమునకు హత్తుకొనుచున్నవి.

మానవహృదయము ప్రకృతి అన్న రెండు కావ్య వస్తువులకు ఇక్కడ సమ్మేళనమే కాదు, ఏకత్వము సిద్ధించినది. ప్రకృతిలో మానవుడు తొంగిచూచుటకాదు. ప్రకృత్యంశములు మానవీయములేయైనవి.

కాముకుని కంటి జిగిందగిలి కామభానమునుం బొరసినవి. జడమైన ప్రకృతికి ఒక్కవడి ప్రాణప్రతిష్ఠ, కామప్రతిష్ఠ జరిగిపోయినది. రామగిరినుండి అలకానగరము వలెను ఆర్యావర్తమంతయు చేతనావిర్భూతి నందినది. ఆ చైతన్యసారము చెలికారముగా చెలునొందినది.

యక్షుడు మేఘునితో చెప్పుచున్నాడు :

ఓయీ, అర్ధాంతరుద్ధా, నాయింటి పట్టున నాయిల్లాలు లేజవరాలు ఒంటిగా నన్నుగూర్చి పరితపించుచున్నది. నా కుశలవార్త నామె కందిచ్చుటకు ప్రయాణము కావయ్యా. నీకు దారితోడు కొసవలకు హంసలు తరలి వచ్చునులే. నీ మిత్త్రుడీ రామగిరిని కౌగిలించి సెలవుదీసికో. ఆ మాలక్షేత్రము నుపలాలించు. ఆమ్రకూటుడు పూర్వకృతోపకారము దలచి నిన్ను నెత్తిన బెట్టుకోగలడు. నర్మదానదిని చూడు – వింధ్యగిరి పాదములంటి వేడుకొనుచున్న ప్రణయిని. కొండ కొండ మీద నీ కెదురు వచ్చి స్వాగతము పల్కు నెమళ్లను సంభావించు. కాని ఆగిపోక ప్రయాణము సాగించు. విదిశానగరము ప్రక్కన వేత్రవతితో చెలిమి గలుపు. యావత విహారస్థానమైన నీ చైరద్రిని సేదదేఱు. ఏటిగట్టు తోపులలో అడవి మల్లెలను ఆహ్లాద పఱచు. పుష్పలావికలకు ముఖకాంతిని పెంపొందించు. చుట్టయినను, విలాసధామమైన ఉజ్జయినికి దారిపట్టు. అక్కడ పౌరాంగనలకు దర్శనీయుడవు కావలె. ఒయ్యారముగా నీ దారిని బరువులెత్తు నిర్వింధ్యానదితో పొందు నెఱపు. కృశించియున్న సింధువునకు వియోగబాధతీర్చు. ఆవల ఉజ్జయిని కలదు స్వర్గసీమవంటిది. శిప్రాతరమున మేడలపై విశ్రమించు – మహాకాలస్వామిని సేవించు – గంభీరానదీ ప్రణయము రిత్తబుచ్చకు. దేవగిరిచేరి స్కందదేవు నారాధించు. ఆపైన చర్మణ్వతీ నదిని రంతిదేవ నృపకీర్తిని సమాదరించు. దశపురముపోయి పౌరకాంతల బెళుకు చూపులకు పాత్రము కా – బ్రహ్మావర్తదేశము చొచ్చి కురుక్షేత్రము సందర్శించు – సరస్వతీ నదీ సంసేవన చేత ఆత్మశుద్ధి పొందు. కనఖలము ప్రవేశించి గంగను గాంచు. హిమవన్నగారణ్యము

లలో కార్చిచ్చులు శాంతింప జేయుము. సిద్ధులు సేవించు హరచరణము నకు ప్రదక్షిణ మాచరించు - భజనలలో పాల్గొని మురజధ్వను లెసగించు. క్రౌంచరంధ్రమార్గమున కైలాసగిరి చేరుకో - విహారపరులైన పార్వతీ పరమేశ్వరుల పాదస్పర్శపొంది పునీతుడవు కా - మానససరోవరోపాంత మున వినోదించు - మఱిచూడు-కొండయొడిలో నున్నది, జాఱుచున్న వియన్నది పట్టుపైటతో అలకాపురి.

ఇది మార్గవర్ణనము - మేఘునిది విలాస యానమే కాదు తీర్థయాత్ర. దౌత్య కార్యపరుడై తరలినాడు గదా మేఘుడు - మఱి తీర్థయాత్ర యేమి? తీర్థయాత్ర ధర్మాచరణములలో నొకటి. మేఘుని దౌత్యమును ధర్మాచరణమే-ఆర్తత్రాణనము. మేఘుఁడు సరసుఁడు. పరోపకారజీవనుఁడు. అందువలన అతనికి తీర్థగమనమున విలాసము, విలాసగమనమున తీర్థ సంసేవనము, పరస్పరము మిళితములైనవి. యక్షుని కామము దాంపత్య ధర్మాశ్రయమై యున్నట్లు మేఘుని విలాసము తీర్థసేవా సమాశ్రయమైయున్నది. కావుననే మార్గకథనము శివము సుందరమునై యున్నది.

ఇంకను యిట్లు తోచుచున్నది - ఈ తీర్థయాత్రా ఫలమే సుమా నీవు పరమపతివ్రతయైన నా జాయను కాంచగల్గుట - కుమారస్వామిని, పార్వతీ పరమేశ్వరులను సందర్శించుట వంటిదే విరహవ్రతను ఆవిశాలాక్షిని గాంచుట - అని యక్షుడు మేఘునికి సూచించుచున్నాడా యేమి?

లేదా, - నీకు కార్య సాఫల్యము నీ సందేశము వినుటకు యక్షిణి బ్రదికియుండవలయుశే. ఈ దూరప్రయాణమున నీవు కొల్చు యీ దేవతల యనుగ్రహమున, నీవు కృతకార్యుడ వౌటకైన నా జాయ ప్రాణములు నిలుపుకోగలుగుబో— అని యక్షు డనుకొన్నాడా?

కాదా—తాను శక్తిక్రుంకిన కతన స్వయముగా చేయ లేక యున్న తీర్థయాత్రను నెచ్చెలియైన మేఘునిచే జేయించి, ఆ పుణ్యఫలము-శాపనివృత్తి-ప్రియా సమాగమము-తనకు ప్రాపిలు గాక యని ఆశించుచున్నాడా?

మార్గకథనమున పుణ్యస్థల కీర్తనచేసి. అందుచేతనే యాత్రచేసిన ఫలము యక్షు డొందవించుకొన దలచెనా—

అవన్ని యెట్లున్నను, భరతఖండము పుణ్యభూమి యైనందున, తద్వర్ణనము పుణ్యక్షేత్ర వర్ణనముగా భారతీయ సాంప్రదాయము మూర్తిగట్టిన కవికులగురువు శృంగార కావ్యమునను రూపొందించినాడనుట తథ్యము.

౨

ప్రణయ దూతగా కాళిదాసు మబ్బు నెన్నుకొనుట యుక్తముగానే యున్నది.

విరహోద్దీపనము కలిగించినది తొలకరి మబ్బు. ఉపశమనమునకు దానినినే కర్తనుచేయుట సమంజసము. శాకుంతలములోకూడ దుష్యంతుడన్నాడు—నన్ను ఉడుకించుటకును, ఉడుకార్చుటకుగూడ దక్షుడు ఒకడే-మన్మథుడు. అట్లే యిట మేఘుడుగూడ.

అంతేకాదు మబ్బు నిలుకడలేనిది. ఎప్పుడు కదలిపోవుచుండునది. ఈ నిత్యగమనము వార్తాహరుని లక్షణము

వాయుసూనుడైన హనుమంతుని దూత గావించినాడు వాల్మీకి - వాయువే ప్రేరకుడుగా గల మేఘుని కాళిదాసు స్వీకరించినాడు.

అట్లు దక్షిణసీమకు యానము హనుమంతునిది. ఇట్లు ఉత్తరసీమకు ఆకాశయానము మేఘునిది.

రాముడు ధర్మవీరుడు. కావున ఆతని దూత నిత్య బ్రహ్మచారి. యక్షుడు కామోపజీవి- ఆతని దూత సరసుడు విద్యుత్కళత్రుఁడు.

వాల్మీకి చిత్రించిన హనుమద్దౌత్యమే తన మేఘదూతకు ప్రేరకమని వ్యంగ్యముగా కాళిదాసు వెల్లడించినాడు- ప్రథమ శ్లోకములోనే రామగిరిని జనకతనయను స్మరించినాడు- సీతారాముల వియోగమువంటిదే,

మంగళాంతము కాదగినదే యీ యక్షదంపతుల యెడబాటు అని మాత్రమే గాక వారి కుపకరించిన హనుమంతుని వంటివాడే మేఘుడనుటకు సందేశోపక్రమణములోనే "హనుమంతుని మాటలు సీత విన్నట్లుగా నీవు చెప్పు సందేశమును అ విరహిణి సావధానముగా వినగలదు" అని మఱొకమారు ప్రస్తావించినాడు.

తమ్ముడా యని తొలుతనే మేఘుని సంబోధించి తొలగద్రోసికొనక ప్రీతిచేతనో సానుభూతిచేతనో యీపని చేసిపెట్టవయ్యా అని చివరకు చెప్పుచున్నాడు- ఇరువురకును స్థాయిలో కొంత సామ్యమున్నది. మేఘుడు ప్రాగ్దిక్పతియైన యింద్రుని మూలభృత్యుడు- యక్షుడు ఉత్తరదిక్పతియైన కుబేరుని కొలువుకాడు. ఇరువురును రససమృద్ధి కలవారు. జాయాయుక్తుడై గమనశక్తి కలిగియున్న మేఘుడు జాయావియుక్తుడై శక్తిక్రుంకియున్న యక్షునిపై జాలిగొని అతని సందేశము తీసికొనిపోవ నియ్యకొనుట సాజముగానే యున్నది,

3

ఉత్తర మేఘమున అలక, యక్షునిగృహము, యక్షిణి, ఆమె విరహావస్థ క్రమముగా వర్ణితములైనవి. పూర్వకాలపు ప్రభువుల ముఖ్య పట్టణములలో రాజాశ్రయము కల్గియున్న సంపన్న గృహస్థుని భవనము లాగున నున్నది యక్షగృహము. రాచనగళ్లకు ఆవలినైపున, వాకిట రంగు రంగు తోరణములతో, లోగిటిలో గున్నమందారముతో, పెరటిలో మెట్లకట్టు దిగుడుబావితో, నీలిమ నిగలాడు క్రీడాద్రితో, అరటితోటతో గోరట కంచె చుట్టున్న మాధవీమంటపముతో, వకుళాశోక వృక్షములతో, పెంపుడు నెమలికి నెలవుపలకతో, సొంపారుచున్నది ఆ గృహావరణము - ఇక వానికి మెఱుగులు దిద్దినాడు కవి-అవి దివ్యభూములు గదా - కాబట్టి దిగుడుబావిలో నున్నవి హంసలు - మెట్లు మరకతములు. నీటిలో పొందామరలు - తూండ్లు వైడూర్యములు - క్రీడాశృంగములు మహేంద్ర నీల మణులు - నెమలి వాస దండము బంగారు. అరుగు గరుడ పచ్చ - పలకస్ఫటికము.

వలచుచున్నదైన వకుళాశోక వృక్షచ్ఛాయలు ఆదంపతుల విస్రంభ విహారములకు అమరియున్న నెలవులు. వానికిని యక్షిణియెడ వలపు చేష్టను చేర్కొనుచున్నాడు యక్షుడు. వకుళము వదన శీధువును, అశోకము పాదతాడనమును యక్షిణివలన దోహదవ్యాజమున నపేక్షించునవట.

మఱి యక్షిణి శ్యామ – సర్వావయవసుందరి – జవరాండ్ర సృష్టిలో బ్రహ్మదేవుని తొలి శిల్పమట–స్రష్ట తొలి సృష్టి నీరు (రసము).

"యా సృష్టి' స్రష్టురాద్యా" అని శాకుంతలమున నాంది శ్లోకములో కవి చెప్పియున్నాడు. తరుణీ సృష్టిలో తొలి శిల్పమైన యీమె రసమయియని చెప్పకయే చెప్పినట్లయినది. శైశవ బాల్యాద్యవస్థలు లేక సృజనమే యువతిగా చేసినట్టి బ్రహ్మశిల్పమా యనిపించుచున్నది.

పార్వతిని వర్ణించుచో కాళిదాసు అన్నాడు: 'ఉపమాన ద్రవ్య జాతము నంతటిని ఒక్కచోట కూర్చి సౌందర్యమును ఏకస్థము చేయ గోరిన బ్రహ్మ సృష్టించినాడా' అని.

మఱి శకుంతలనో:

'ఏమి! యిది రంగులు కూర్చి బ్రహ్మ తీర్చిన చిత్తరువా? అతడే ఊహలు మలచి చేసిన మూర్తి కల్పనమా!' అని.

లోకసామాన్యమును సృష్టించు బ్రహ్మ లోకోత్తర సుందరమూర్తి కల్పనకు అలంకారికుడో చిత్రకారుడో కవియో కావలయును కాబోలు. కవిత్వ శిల్పమున పారగుడైన కాళిదాసు బ్రహ్మను ఒక శిల్పిగా నూహించుచున్నాడు.

ఆ యక్షిణి విరహిణి. విరహియైన యక్షుడు విరహార్తయైన కాంతె యవస్థను ఊహించి చెప్పుచున్నాడు.

'నా మాఱు ప్రాణము. ఒంటరి చక్రవాకి. మితభాషిణి, మంచు కాచిన తామర తీరుననున్నది. ఊర్పు లేర్చిన మోవి, చేయిని వ్రాలిన చెక్కిలి సంస్కారహీనమై ఆవరించిన ముంగురులు గల దాని మోము మబ్బు చాటయిన చంద్ర బింబము. (ఇది మేఘునకు చక్కగా స్వయముగా తెలిసి యున్న విన్నదనము.)

పగటిపూట - పూజలు చేయుచున్నదో? నా రూపును చిత్రించుచున్నదో? శారికను జీతి సామిని తలచుకొనుచున్నావా యని పల్కరించుచున్నదో? ఒడి నుంచుకొన్న విపంచి మీద నాపైరచించిన గీతి నాలపించుచు మూర్ఛనల తడబడుచున్నదో? గడపపై పూలుంచుచు విరహావశేష వాసరములు లెక్కవేసి కొనుచున్నదో? మనస్సున సమాగమమూహించు కొనుచున్నదో?

రాత్రివేళ — ఈ వ్యాపారములును లేవాయె. శయ్యపై నొత్తిగిలి పరుండి జాగరము సేయుచుండును. కలయిక రోజున క్షణమైన యామము ఒంటరి పాటున యుగముగదా - వేడి కన్నీటితో వేగింపవలె - గవాక్ష ముఖమున జాబిలి కాంతులు లోనికి ప్రసరింపగా నెదురేగు చూపులను క్రమ్మఱించుకొని ఆచిన్నది మబ్బుపట్టిన రోజున విచ్చని మూయని మెట్ట తామర కుద్ది సేయగలదు - కఱకువాటి చెక్కుల వ్రేలు ముంగురులను నిట్టూర్పులతో ద్రోయుచుండును. కన్నీటి కాల్వలు అడ్డము పెట్టు నిద్రకై స్వప్న సమాగమాపేక్షతో అక్కఱి పడుచుండును. చెక్కిటిపై జాఱు విషమైక వేణిని క్రేగయిగోళ్ళ ద్రోయుచుండును. ఒంటిపై నొక్క సొమ్ములేక ఒంటరిపాటున సెజ్జపై మాటిమాటికి వ్రాలిపోవు నా సుందరిఁగన్నంతనే నీవు జాలితో క్రొన్నీరు కన్నీరుగా విడువగలవు. నేనేమో అందగాడనని నా ప్రియురాలు నాకై బెంగగొని యిట్లున్నదని భ్రమగొని నేననుట గాదయా యిది - దాని మక్కువ పెక్కువ నాకు తెలియును. నామాటలయథార్థము నీవే తొందరలో చూడగలవు.

౮

ఇక సందేశ సౌభాగ్యము - యక్షుడు యక్షిణితో మేఘుని జెప్ప పనుచున్నాడు:

సుమంగలీ, ఇది విను - నేను నీభర్తకు చెలికాడను. అతడు జీవించి యున్నాడు రామగిరిలో - నీక్షేమము తెలిసికోగోరుచున్నాడు. నెచ్చెలి పిందు ముందు వెల్లడి మాటనే నీకు చెవిలోచెప్పువాడు కంటికి చాటయి నానోట యీమాటలు నీకు చెప్పుచున్నాడు.

ఈ యుపోద్ఘాతముతో ఆమె సావధానముగా సీతాదేవి హనుమద్భాషణమును విన్నట్లు వినగలదని నిశ్చయించి మఱి చెప్పుచున్నాడు-

ప్రేయసీ, సమగ్రమయిన నీమూర్తి ప్రకృతిదర్పణమునగూడ నాకిక్కడ గోచరించుట లేదు. కాని నీరూపు చిన్నెలే నాకు సర్వత్ర కనిపించుచున్నవి ప్రేంకణపు తీవలలో నీ గాత్రము - బెదరుగొన్న లేడి కన్నులలో నీ చూపు - చంద్రబింబములో నీ మోము- నెమలి పింఛములో నీవేణి - యేటి చిఱుకెరటాలలో నీ కనుబొమలు - నాకు దర్శన మిచ్చుచున్నవి - అయినను సామ్య దర్శనము చెదరి, చెదరియున్నది - (నా కంటికి నీ లక్షణములే కనబడుచున్న వనుటలో నామనసున నీవే మెదలుచున్నావనుట.)

విరహాపనోదనమునకై నిన్ను అలుకగొన్న దానిగా, నన్ను నీకు పాదాక్రాంతునిగా శిలపై ధాతు రాగములతో చిత్రించి చూచుకోదలచి ప్రయత్నించి కన్నీరడ్డుతగిలి విఫలుడనగుచున్నాను. (చిత్రదర్శనము బాష్పోపహతమై పోయినది.)

స్వప్న సమాగమములందు నిన్ను నేను పరిరంభణసేయుచు బాహువులు చాచి బయలూచు నన్నుగాంచి వనదేవతలు కార్చు కన్నీరు సుమాచివురు చిప్పలలో ముత్యాలజాలు (స్వప్నదర్శనము కరుణావసరమగుచున్నది.)

నిన్ను తవుల లేకయున్న నేను నిద్దవిలి వచ్చుచున్నవి గదా యని హిమవన్నగానిలములను ఒత్తుగా కౌగిలించుకొనుచున్నాను (స్పర్శానుభూతి గాలి గౌగిలియైనది.)

రాత్రి క్షణము కారాదా - పవలు సాగక తేయెండగానే యుండరాదా - అని దుర్లభార్థము లాకాంక్షించుచున్నాను - (విపరీతమైన విరహార్తికి ప్రకృతియే విపరీతము కావుట.)

ఏమగుదువో అని నీవు మఱింత దిగులు పడకు. నేను ప్రత్యాశతో ప్రాణములు నిల్పుకోగలను. నీవును అట్లే నిలుపుకో - మన యెడబాటు సావధికమేగదా - రానున్న శరజ్జ్యోత్స్నలందు మన సమాగమమూహించుకో. (ఎడబాటునకు విఱుపు, ప్రత్యాశ యన్నది ఉన్నదిగదా యని తాను తెప్పిరిలి ఆమెను తెప్పిరిల్ల జేయుచున్నాడు.)

ఈ సందేశవాక్యములు యక్షుని మాటలేనో, కావో, అన్న సంశయమును సంపూర్ణముగా తుడిచివైచుటకు చివరకు ఆనవాలును రూపించుచున్నాడు; నిశీథిని ఏకశయ్యను నిద్ర మేల్కొని యేడ్చుట - ఆమె నతడు బ్రతిమాలుట - అస్వాధీనపతిక సరసముగా నతని దూఱుట-యన్న రహస్సన్నివేశము మరొకరి కెఱుగరానిది ఊహింపరానిది ప్రమాణపదమైనది.

ఆ యానవాలు ఆ సందేశమున కంతకును తలమానికముగా నున్నది. 'ఏకశయ్యాగతుడనైయున్న నన్ను అంతలో అనుమానపడునంతటి వలపు పెంపు గల చిన్నదానవు - ఇప్పుడింత దూరమున నెలలుగా ప్రవాసమున్న నన్నెంతగా అనుమానించుచున్నావో! అని యక్షుడు తలపోసి, తాను ప్రాణములతో నుండుటయేగాదు - తన ప్రేముడి సడలలేదని ఆమెకు తెలియవలయుటకై, సిద్ధాంతీకరించుచున్నాడు: "ఎడబాటుతో చెలికారము సన్నగిల్లుననుట పొరపాటు. ఇష్టవస్త్వనుభూతి రిక్తమైనపుడు ఆ యిష్టము రసోత్కర్ష చేత ప్రేమరాశి యగుచున్నది"—అలంకారికులు అందులకే విప్రలంభ శృంగారము అధికతరమన్నది.

౫

రసోదంచితమైన యీ కావ్యమునకు భారతావనిలో మల్లినాథ సూరి రచించి సంజీవనీ వ్యాఖ్య ప్రశస్తమై యున్నది. దానికి చేటికగా శ్రీ వేదము వేంకటరాయశాస్త్రులవారు వ్రాసిన తెలుగు వ్యాఖ్యయు అఖిలాంధ్ర ప్రశస్తిగన్నది. 1957 లో భారతసాహిత్య అకాడమీ యాజమాన్యమున సుశీలకుమారదేవుగారు పరిష్కర్తగా అధికారముద్రతో మేఘదూత ప్రకటితమై యున్నది. మేఘదూతకు ఇంతవఱకును లభ్యమైన ప్రతు లన్నింటిని సంశోధించి, వ్యాఖ్యానములన్నింటిని పరిశీలించి, ప్రక్షిప్తములను వెలువఱచి, సాకల్యముగా తీర్చిన ప్రకటన కావుటచేత అందలి సంఖ్యాగణనమునే నేను పాటించి యున్నాను. 111 శ్లోకములు మాత్రము కాళిదాసీయములని తక్కినవి ప్రక్షిప్తములని దేవుగారు నిర్ణయించి యున్నారు. మల్లినాథ సూరిగారు 121 శ్లోకములను వ్యాఖ్యానించియు ఆరింటిని అందులో ప్రక్షిప్తములని సూచించియే యున్నారు. ప్రక్షిప్తశ్లోకములను పదింటిని నేను అనువదించితినిగాని సంఖ్యాగణనములో చేర్చలేదు.

అవ్యుత్పన్నుడనైనను రసప్రలోభము కారణముగా నే నీ కాళిదాస కృతిని తెలుగు సేయుట తటస్థించినది. మూలమునకు చేరువగా నుండవలెననియే నా యాశయము. అదెంతవఱకు నెఱవేఱినదో చదువరులే నిర్ణయించ గలరు. రచనా సౌలభ్యము కొఱకు అటనట చేర్పు జార్పులుండక పోవు. ప్రతిపదమును సప్రయోజనముగా రచించిన మూల శ్లోకములకు బింబ ప్రతి బింబముగా అనువాదము దుర్ఘటమని విద్వల్లోక మెఱింగినదే. పదప్రయోజనమును శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు తమ వివరణములో చక్కగా ప్రదర్శించి యున్నారు. అందొకటి ; యక్షుడు తనను శపించిన కుబేరుని పేర్కొన్న చోట్ల నెల్ల 'ధనపతి' యని సూచించినాడే గాని ఔదార్య సూచకమైన 'ధనద' శబ్దము ప్రయోగింపలేదు. అనువాదములో నొకచోట 'రక్తకంఠ సంపన్నులు కిన్నరుల్ ధనదు ప్రాభవముఁ బయిస్థాయిఁ బాడ' అన్నాను. అది ఆ సంధర్భములో

సమర్థనీయము కావచ్చును. కాదనుకొన్నచో 'ధనపుష్ప్రాభవము' అని పఠింపవచ్చును. ఇంతకు ఆ శ్లోకము ప్రక్షిప్తమన్నారు దేవుగారు.

మఱియు, కాళిదాసు మెలకువకు శ్రీ శాస్త్రులవారే 'ఆషాఢ ప్రథమ దివసే' అను పాఠనిర్ణయములో ప్రస్తావించి యున్నారు; కార్తిక శుద్ధ యేకాదశికి శాపాంతమని ఇక నాలుగు నెలలు మిగులున్నదని మేఘుడు అలకలో యక్షిణితో చెప్పుచో, రామగిరిలో యక్షుడు మేఘుని సంబోధించుట ఆషాఢ శుద్ధ పాడ్యమి యన్నచో, మధ్యనున్న పదిరోజులేమైనట్లు! అవి ప్రయాణమున సరిగా పది మజిలీలకు సరిపోయినవి.

ఇంతటి జాగరూకతతో రచించిన కవి కృతిని అరము చేసికొనుటలోను అనువదించుటలోను నా యజ్ఞత వలన జనించిన దోషములకు క్షంతవ్యుడను.

౬

కాళిదాసు పేర్కొన్న స్థలములను గూర్చిన వివరణ మొకటి అకాడమీ ముద్రణములో నున్నది. దాని ననుసరించి ఆయాస్థలములకు ప్రకృతనామములు తెలియదగినంతవఱకు సంగ్రహముగా ఇందుదహరించి యున్నాను.

రామగిరి : నాగపూరునకు 24 మైళ్ల దూరములో 'రామటేక్' అని పేరుగల ఒక క్షేత్రము (విల్సను.)

మాలము : 'ఛాటిస్‌గడ్' ఉత్తర ప్రాంతములో 'రత్నపూర్' నకు చేరువన 'మాల్డా' యన్న ప్రదేశము (విల్సను.)

ఆమ్రకూటగిరి : 'అమరకంటక్' (విల్సను.)

దశార్ణము : మాళవము.

విదిశ : 'భిల్సా' పట్టణము.

వేత్రవతి : బేట్వానది : మాళవమున వింధ్యపర్వతములలో పుట్టి 'కాల్పీ' వద్ద యమునానదిలో చేరుచున్నది.

నీచైరద్రి : 'భిల్సా' చేరువన చిన్నకొండ.

విశాల : ఉజ్జయిని. అవంతి (మాళవము) దేశమునకు రాజధాని.

| | |
|---|---|
| శిప్రానది : | ఉజ్జయిని చెంత పాఱునది. |
| సింధు : | 'కాళాసింధు' అన్నది. 'చంబల్' నదికి ఉపనది. |
| నిర్వింధ్య : | 'నేవుజ్'–చంబల్ నదికి ఉపనది. |
| గంభీర : | మాళవములో నొక చిన్ననది. శిప్రానదికి ఉపనది. |
| దేవగిరి : | 'ఝూన్సీ'కి నైర్ఋతిని 60 మైళ్లు దూరములో నున్న ధేవఘుర్ అను స్కందక్షేత్రము. |
| చర్మణ్వతి : | 'చంబల్' నది. |
| దశపురము : | దశోర్ (మందశోర్) శివదానది యొడ్డున మాళవములో నున్నది. |
| బ్రహ్మావర్తము : | 'సరస్వతీ' 'దృషద్వతీ' నదుల నడిమి భూభాగము. సోనేపట్, అమీన్, కర్నల్, పానిపట్ మండలములు ఇందులోనివి. |
| కురుక్షేత్రము : | తానేశ్వర్ సమీపమున ఇప్పటికిని యాత్రాస్థలము. |
| సరస్వతి : | కురుక్షేత్రమునకు చేరువ వాయవ్యమున ప్రవహించి మార్వార్ యిసుకలలో ఇనికి పోవునది, |
| కనఖలము : | హరద్వారము చెంత గంగ పడమటి యొడ్డున చిన్న గ్రామము. |
| చరణన్యాసము : | హరద్వారము సమీపమున 'హర్ కా పైరీ'. |
| మానససరోవరము : | 14900 అడుగుల యెత్తున హిమాలయములలో నున్న 133 చదరపు మైళ్ల వైశాల్యముగల సరస్సు. |
| కైలాసము : | మానససరస్సు ఉత్తరపు గట్టునకు 26 మైళ్లలో నున్న మంచుకొండ. |
| అలక : | కైలాసగిరి పార్శ్వమున నున్నట్లు పురాణప్రశస్తమైన కుబేరపురము. |

ఇరువది ఆరవ శ్లోకమున ప్రస్తావించిన 'వననది' సామాన్యవాచకమే గాని ప్రత్యేకముగా నిర్దిష్టమైన యొకానొక నదిగా తోపదు.

గుట్టుం వేంకటసుబ్రహ్మణ్యము.

# మే ఘ దూ త ము

## పూ ర్వ మే ఘ ము

శ్రీయుతుఁ డొక్క యక్షుఁ డొనరించి ప్రమాదము కొల్వుసేఁతలో
'జాయను బాయు వర్ష' మని స్వామి శపింపఁగ శక్తి గ్రుంకఁగాఁ
బోయి వసించె రామగిరి, భూసుత యాడిన పుణ్యతోయముల్
ఛాయల నీన్ నమేరుతరుజాలములుం గల యాశ్రమంబులన్. 1

అమ్మలఁ బుచ్చెఁ గొన్ని నెల లమ్మదనార్తుఁడు విప్రయుక్తుఁడై
యుమ్మలికం బసిండి కడె మూడిన ముంజెయి రిత్తవోవఁ, బ్రే
క్ష్యమ్మును వప్రకేళి రద మడ్డము గ్రుమ్ము గజమ్ము వోని మే
ఘమ్మును శ్లిష్టసానువును గాంచె శుచిం దొలి వాసరంబునన్. 2

కనుగవ నీర మూఁగి కడఁకన్ నిలువంబడి మబ్బు మ్రోల నె
మ్మనమునఁ గోర్కెలూరఁ బెరిమం దడవుండె నతండు స్రుక్కుచున్;
మనసొకరీతి వోవుఁ గద మబ్బు గనన్ సుఖికే, మెడం బెనం
గొనఁ దమకించు కూరిమిజనుల్ కడ కొక్కరు గాఁగ నేమనన్. 3

చేరువ యౌట శ్రావణము, చేడియ జీవము నిల్ప నత్తఱిన్
గోరె మహాతురుండు సుభగుం డనుపన్ దన క్షేమవార్తఁ, జే
కూరిన కొండమల్లియల క్రొంబువు లర్ఘ్యముగా నొసంగి యెం
తో రహిం స్వాగతం బడిగెఁ దొల్కరి మేఘుని వ్యోమగామినిన్. 4

పొగయుం జోతియు నీరు గాలి యొకటం బ్రోవైన మబ్బెడ, యె
ప్పుగ నా యా కరణంబు లన్ని గల జీవుల్ సేర్చు సందేశ మే
డ, గణింపం డెద మూలి, యా జలదు వేడం బూనె, నైసర్గికం
బుగఁ గామార్తులు చేతనంబును జడంబుల్ వేడు దీనుల్ గదా.
5

భువనఖ్యాతము నీ మహాన్వయము, పూర్వుల్ పుష్కలావర్తకుల్
దివిజ స్వామికి మూలభృత్యుఁడవు, నెంతే కామరూపుండ, వే
ను విధి ప్రాప్తిని బంధుదూరగుఁడ, నిన్నున్ వేడు వాఁడన్, వృథా
యవుటే మేల్ గుణిపట్ల యాచ్ఞ సఫలం బౌ కంటె నీచాప్తిచేన్.
6

శరణమవీవ తప్తులకు, శప్తుఁడనై ధననాథు నల్కఁ, దు
స్తర విరహార్తి పాలయితిఁ, దన్వికి నాదగు వార్తఁ జేర్పవే;
పురివెలిదోఁటఁ గ్రాల్ శివుని ముందల జాబిలి కాంతి దోఁగు నం
బర పరిచుంబిహర్మ్యమయి మా యలకల్ గన నీకుఁ బోఁ దగున్.
7

వాయువు త్రోవ పట్టు నినుఁ బాంథసతుల్ గను వారు ముంగురుల్
ద్రోయుచుఁ బైకిఁ, బ్రత్యయముతో మది నూఱటపాటు సెందు-చో
తోయద, ప్రోల నిన్ననుటతో నెవఁడయ్య వియోగ కార్శ్యయా
జాయ నుపేక్ష సేయు, స్వవశస్థితి నోచని నేను గా కిటుల్.

8

ప్రేరణ మల్లసల్ల నొనరించును నిన్ననుకూలవాయు, విం
పారఁగ వామపార్శ్వమునఁ బాడు సగంధము చాతకంబునున్;
బారులు తీరి బెగ్గురులు, వారిద, కన్నులవిందవైన ని
న్జేరి భజింపఁగాఁ గలవు నింగి, నిషేకసుఖం బెఱుంగుటన్.
9

నీ పయనంబు నెగ్గుఁ, గననేర్తువు పో పతిదేవతన్, ధ్రువం,
బూపిరి తోడ నీ వదిన యున్నది లెక్కిడుచున్ దినంబులన్;
ఆపదె యాశబంధ మప్పుడప్పుడె రాల్ప్రణయోద్ధురమ్ము పు
ష్పోపమ మంగనాహృదయ ముర్వి వియోగవిపద్దినంబులన్.
10

నేల నవంధ్యసేఁత, యల నేలయురంటుల పుట్టుసేఁత, నీ
దా లలితంపుమ్రోఁత విని నంతనె మానసకౌతుకంబులై
వైళమ తమ్మితూండ్ల చిద్రుపల్ గొని బత్తెము, నింగిదారి, నీ
త్తో లలి రాజహంసములు తోడుగ వచ్చును వెండికొండకున్.
11

అడుగుమనుజ్ఞఁ గౌఁగిలిడి, యాప్త సమున్నతు నీగిరీంద్రునిన్
నడుముల రామదేవచరణంబుల చిన్నెలు దాల్చు వీఁడు, మీ
కడరెడు నేటి కొక్కుతటి యందున కూటమి గాన, దీర్ఘమా
నెడయిక నుష్ణబాష్పసృతి యేర్పడ, నేర్పడఁ జెల్మి, క్రాలెడిన్.
12

త్రోవ వచించెదన్ వినుము తోయద త్వద్గమనానుకూల, మా
పై విను శ్రోత్రపేయమును వాచికముం నెఱయించువాఁడ, నీ
త్రోవను గాలు మోపఁగ గిరుల్ గల వెప్పటికప్డు డస్సినన్
త్రావ లఘూదకంబు లలరార్నదులుం గలవోయి స్రుక్కినన్.
13

నగశృంగమ్మును గాలి చిమ్ముకొని మింటం బోవునన్ భ్రాంతితో
ముగుదల్ సిద్ధవధూటు లుల్కుచుఁ గనన్ మోమెత్తి,
యుత్సాహ మా
ర గమింపంగదవే రసార్ద్రనిచులప్రాంతం బిటన్ లేచుచున్
దగవా దారి నుదీచికిన్, దలఁగి దిఙ్నాగోరుహస్తోద్ధృతుల్.
14

వారిద, వామలూరుశిఖపై నెదురన్ సొబగారు రత్నవి
స్ఫారవిభాసమేళనము శక్రధనుశ్శకలంబు శ్యామలా
కారుని నిన్నుఁ జెంద వెలుఁగం గల వీవు సబర్హశేఖరా
పారవిలాసి గోపకులభాసి మనోహరశౌరి కన్ననున్.
15

కృషిఫల మెల్ల నీ చలువయే యని పల్లెపడంతు లర్థిఁ జా
క్షుషముగఁ గ్రోల నిన్ను బొమసొంపులు నేరని ముద్దియల్, హలో
త్కషణసుగంధ మార నొడికంబుగ క్షేత్రము మాలమెక్కి, మో
పృషదుపలాలి పశ్చిమ మొకించుక తాజె యుదీచి పో వెసన్.
16

ధారల దావ మార్పిన కృతశ్రము నధ్వగతిశ్రమున్ నిన్నున్
దీరుగ మౌళిఁ దాల్చుఁగద నీరద పర్వతుఁ డామ్రకూటుఁ, డే
తేరఁగ నెయ్యుఁ డాశ్రయమతిన్ దొలిమేల్ దలపోసి
యల్పుఁడున్
మాఱుమొగంబు వెట్టఁ డనిన్ గడుదొడ్డల నట్టిరే మనన్. 17

ప్రక్కల నెల్ల నావరిలఁ బక్వఫలచ్ఛవిఁ గానమామ్రముల్
నెక్కొన నీవు మౌళిపయి స్నిగ్ధలసత్కబరీసవర్ణతన్
జొక్కపు నీలిమన్ నడుమ, చుట్టు విపాండిమమున్ వహించు నా
చక్కని కొండ ధారుణి కుచంబనఁ గాంతురు దేవదంపతుల్. 18

ఆఁగి యొకింత సే పచట నాటవికాపరిభుక్తకుంజవ
ద్భాగములన్, రసోత్సృజన పాటిల, వేగమ దారి సాగి, యా
పైఁ గనుమోయి, యేన్గుమెయి భక్తివిభంగులభూతి వోలెఁ గ్రాల్
బ్రాగురుగండవింధ్యగిరిపాదవిశీర్ణను నర్మదానదిన్. 19

పన్నుగ వాంతవృష్టివయి, వన్యగజేంద్రమదానువాసితం
బ న్నది తిక్తనీరము రయం బురుజంబువు లాఁగఁ ద్రాగి పో
వన్న, బలంబు లోఁ గలుగు నంతట వాయువు నిన్ గదల్పలేఁ
డెన్నఁగ రిక్తుఁ డెందు లఘువే, పరిపూర్ణుఁడు గౌరవాఢ్యుఁడే. 20

జలదా, యర్ధసముత్థకేసర హరిత్ శ్యావస్ఫురన్నీపముల్
తొలిమొగ్గల్ దోడు కందళుల్ కసెములన్ దోత్త్రేత
గొంచున్, వనం
బులఁ బెల్లుబ్బెడు నేలతావి వరుసల్ మూర్కొంచు సారంగముల్
లలిఁ జిన్కుల్ చిలికించి నీవు సనఁ బోల్ మార్గంబు సూచించెడిన్.
21

* వెరవుగఁ జిన్కు లానఁ గల పిట్టలఁ జూచుచుఁ జాతకంబులన్
వరుసలు తీఱు బెగ్గురుల వారక లెక్కిడి ప్రేలఁ జూపుచున్
మురియుచు నున్న సిద్ధు లుఱుమున్ విని తొట్రిలు తోడికాంత
లాంతురపడి కౌఁగిలింపఁ బరితోషముతోడ భజింత్రు నిన్ జుమీ.

పయనము సత్వరం బొనరుపంగఁ దలంతువ మత్ప్రియార్థ, మ
ట్లయిన విలంబ మాను గుటజాంచితగంధము కొండ కొండపై
ప్రియముగ స్వాగతంబు బచరించుచుఁ గేకులు హర్ష బాష్పప
న్నయనములై యెదుర్పన, ఘనా, యెటులో త్వరఁ బోవఁ
జూడుమా.
22

ఎనయ దశార్ణమీవు, కొన లించుక విచ్చు మొగిళ్ల వెల్గు తె
ల్లను దెలుపారుఁ, గ్రందుగఁ గులాయవినిర్మితి రచ్చమ్రాకులన్
బొనరుచు గ్రామ్యపక్షులు, వనుల్ నలుపారఁగ నేరెడుల్ ఫలిం
చును, మఱి యంచ లందు సిలుచుం జుమి యొక్కటి
రెండు పూటలే.
23

అరుగుమ రాజధాని విదిశాఖ్య దిశాప్రథితాఖ్యఁ జేర, వే
గిర మటఁ గామశీలతకుఁ గృత్స్నఫలంబును బొందు, మంచితం
బుఱుముచు నద్దరిన్ గొను చలోర్మిక వేత్రవతీపయస్సు, సుం
దరిబొమ మోడ్పు మోము మణితధ్వను లొప్పఁగఁ గ్రోలు
కైవడిన్.

24

నీచైరద్రిని సేద దేఱు మట, నిన్ జెందన్ గగుర్పాటనాఁ
దోఁచున్ బ్రస్ఫుటనీపపుష్పవితతుల్ దోరంబుగా, యౌవన
ప్రాచుర్యాంచితవారకాంతలు రమింపన్ దచ్ఛిలావేశ్మముల్
వాచించున్ రతిసౌరభోద్గతులచేఁ బౌరోద్ధురప్రాయముల్.

25

ఆపయి సాగి పొమ్ము గహనాంతరసీమల నేటి గట్లఁ గ్రాల్
దోఁపుల యూథికాకళికలుం దడిసేయుచుఁ దొల్కరింపులన్;
పాపుట చెక్కిటన్ జెమట వాడిన వీన్గలువల్ వహించు పు
ష్పాపచయాంగనాననము లారఁగఁ జాయ
క్షణం బొసంగుచున్.

26

నీరద, యుత్తరాశఁ జను నీకిది చుట్టగు దారి, యైన నీ
వూరక పోవఁ జూడకుమ యుజ్జని మేడల మీఁద వ్రాలకే;
స్ఫారచలత్తటిచ్చకిత పౌరవధూసదపాంగలోచన
శ్రీ రమియింపవేని యట, జీవనధారణ వ్యర్థమే గదా.

27

చలదూర్మి స్తనితాండజావళులు చంచత్కాంచియై మ్రోయ, సం
స్ఖలితోద్యద్గతి సొంపు మీఱ, సుడి సమ్యగ్నాభి దృక్పర్వమై
వెలయన్, దారిని బర్వు నేటి నల నిర్వింధ్యన్ రసాభ్యంతరం
బలరం గూడుము, మొయారమే తొలివచస్సౌ స్త్రీల కభ్యర్థనన్. 28

ప్రాకటతీర భూరుహనిపాతిత శోషిత పర్ణపాండుర
శ్రీ కమనీయ నీ చెలువు చెన్ను వియోగదశన్ వెలార్చుచున్
స్తోకజలైకవేణి పథిఁ దోఁచును సింధువు, దాని కార్శ్య మే
జోకన తీఱునో సుభగ, చొక్కముగా నది నీవ సల్పుమా. 29

పదపడి యయ్యవంతిఁ జొరు, వత్సకథావిదులైన పెద్దలుం
బొదలెడు సీమ, చెప్పితినె పొమ్ము విశాలకు శ్రీవిశాల, క
య్యది పొలుపారుఁ బుణ్యఫల మల్పముగా నిల డిగ్గు స్వర్గతుల్
త్రిదివతలైకఖండమును దెచ్చిరనా నవశేషపుణ్యతన్. 30

ఆ నగరిం బ్రభాతముల సంగన లొందు రతశ్రమంబు శి
ప్రానిలుఁ డార్చుఁ జాటువులఁ బ్రార్థిలు కాంతుని బోలి, సారస
స్వానము సాగఁజేయుచును సారకలోన్మదవిస్ఫుటంబు, నం
గానుగుణంబుగాఁ దవులనై స్ఫుటితాంబుజసౌరభాఢ్యుఁడై. 31

S.V. UNIVERSITY LIBRARY TIRUPATI 55568

జాలోద్గీర్ణము లీనఁ బుష్పి కబరీసంస్కారధూపావళుల్
హాళిన్ నృత్యము గానకృ వెట్ట స్వజనప్రాప్తిన్ గలాపుల్, పుర
శ్రీ లక్షించుచుఁ బూలతావినెలవుల్ సీమంతినీచారుపా
దాలక్తాంకము లైన హర్మ్యముల మార్గాయాసముం
బాయుమా. 32

035,1D40 ·N58

ప్రమథులు చూడ సాదరత స్వామిగళచ్ఛవి వంచు నిన్ను, సే
వ్యము భువనేశు చండిపతి యాలయ మేగుమ, కైరవోత్థగం
ధము జలకేళిలోలవనితావపురంచితగంధ మొప్ప సం
భ్రమణ మొనర్చు గంధవతి మారుతముల్ కదలార్చుఁ దద్వనిన్. 33

పోలఁగ నోండు వేళ కటఁ బోయితి వేనియు వేవుమా మహా
కాళమునం దహస్కరుఁడు కంటికిఁ జాటగునంత దనక్రున్;
శూలికి సాంధ్యపూజ యగుచోఁ బటహత్వ మొనర్చి మంద్ర గ
ర్జాలి కఖండసత్ఫలము నందుకొనం గదె నీవు వారిదా. 34

సేవింపన్ బదచారణక్వణనకాంచీదామలా వేశ్య లా
దేవున్, రత్నవిభావృతోద్వళులఁ బ్రీతిన్ లీల వింజామరల్
వీవన్ జేతులు డయ్యఁ, దొల్జినుకు లొప్పింపన్ నఖాంకంబులన్
నీ, వర్పింతురు తేటిబారునిడుపుల్ నీకుం గటాక్షావళుల్. 35

అవలఁ జెలంగఁ దాండవమహం బటఁ బ్రాంశుభుజావనీమహా
టవి పయి మండలంబయి, స్ఫుటస్ఫుటనూత్నజపాసుమారుణ
చ్ఛవి నెఱసంజ నెట్టినయి, శర్వున కార్ద్రగజాజినేచ్ఛఁ దీ
ర్పవె, యుమ నీదుభక్తిని నిరస్తభయాస్తిమితాక్షియై కనన్.
36

తెఱవలు సేరఁ గాంతు వసతిన్ జనుచో నిసివేళ నప్పురిన్
దఱచగు చీఁకటుల్ నృపపథంబున నేత్రనిరోధమైన, నో
యొఱపరి పైడిరేక యొఱపొప్పు మెఱుంగున దారిఁ జూపుమా;
యుఱుమకు మోయి నీగోలుకకోయి కడుంగడు భీరువుల్సుమా.
37

పొరి పొరి విస్ఫురించి మెఱుపుంజెలి వాడ నదేని మేడఁ బా
వురములు నిద్రవో వలభిముందల వ్రాలుము, రేయి బుచ్చుమా;
మరల దివాకరుండు వొడమన్ గమనింపుము యధ్వశేష, మె
వ్వరు సుహృదర్థముం జలుపు పట్టునఁ జేయరు గా విలంబమున్.
38

నెమ్మిని ఖండితాంగనల నేత్రజలంబులు కాంతు లొత్త నా
యమ్మగు వేళ యాటది, రయంబునఁ బాయుము
భానుమార్గమున్.
తమ్మికి మంచుబాష్ప మఱఁ దన్ముఖమాదృతి నొత్త వచ్చినాఁ
డమ్మహనీయుఁడున్ గెరలఁడా మఱి తత్కర మడ్డితేనియున్.
39

అల గంభీర పయస్వినీమణి ప్రసన్నాంతస్సునుం బోలు స
త్సలిలంబందు నిసర్గసుందరభవచ్ఛాయాత్మనేన్ లోఁ గొనున్;
జలదా, నిబ్బర మూని వ్యర్థములుగాఁ జల్లంగ సర్వాంబు గా
దులుపల్ కైరవశుభ్రతచ్ఛటులమీనోద్వర్తనాలోకముల్.

40

ప్రవిమలనీలవారివలిపంబును ముక్తతటస్ఫురత్కటిన్
దవిలిన ప్రబ్బలింగవటఁ దన్నది కేల బలెన్ ధృతంబునున్
దిపుట హరించి వ్రేలనవు నీ కవుఁ గాత ప్రయాణ మెట్టులోఁ;
వివృతనితంబఁ బాయ రసవేది యొవండు వలంతి యుద్యోడున్.

41

చినుకుల నీవు చిల్కరిలఁ జెచ్చెఱ నుబ్బెడు నేలతావి మే
కొని ముకుతోజ్జ్వలం గడలుకో సుభగధ్వని జుజ్జ నేర్చు, లా
య్యాన రవణించు చయ్యెడవులందలి మేడులఁ బండఁ జేయు చ
ల్లన వలిగాలి దేవగిరి లాలసఁ బోయెడు నీకు వీచుతన్.

42

నెల వది స్కందదేవునకు, నీ వభిషేక మొనర్పు స్వర్నదీ
సలిలసమార్ద్రపుష్పవిలసన్నవధారలఁ బూలమబ్బవై;
బలరిపు సేనఁ గాచుటకు వహ్నిముఖంబునఁ జంద్రమౌళి క
న్వెలుఁగు ప్రభాకరాతిగము పేర్మిఁ జనించెఁగదా పయోధరా.

43

హారశశికాంతిచేత ధవళాయితమా యదపాంగ, మంబ తాఁ
జెరువు యదుజ్జ్వలద్వలయ శీర్ణము బర్హము కల్వ రేకులన్
దొరయు చెవిన్ గుమారు పయిఁ దోరపుఁ బ్రేముడిఁ, దత్కలాపిని
ర్భరముగ నాడ, గర్జ సలుపంగదె యగ్గిరి మాఱు మ్రోయఁగన్.
44

శరవణజాతదేవుని భృశం బిటు లర్చ యొనర్చి, ముందు వే
దరలుమ, వైణికుల్ చినుకు తత్తుల దారిడ సిద్ధదంపతుల్;
సురభిసుతాక్రతుజ్ఞపనశుద్ధిజమై నది రూపు గొన్నదై
కెరలిన రంతిదేవనృపకీర్తి కడన్ నిలు గారవంబునన్.
45

జలము గ్రహింప వ్రేల నట శౌరితనుద్యుతిచోర నీవు, ద
వ్వులఁ దమ చూడ్కి వంచి కను వ్యోమచరాళికి సూక్ష్మ
రూపమై
యల సరిదుత్కటౌఘ మల రారును మధ్య మహేంద్రనీలముం
గలిగిన మౌక్తికావళి యొకం డవనీసతి తాల్చి పొల్చునాన్.
46

దశపుర మేగు మా నదిని దాటి, తమిం గను నీదు మూర్తినిన్
భృశముగ భ్రూవిలాసముల నేర్చిన పౌరవధూసమూహముల్;
దృశల వినీలతాశబలదీప్తుల నల్లను ఱెప్ప లెత్తి నీ
దిశ నెగజిమ్ము కుందవితతిన్ వెను నన్ మధుపాళి సొంపునన్.
47

అవలం జాయఁ బ్రవేశిలం గద వే బ్రహ్మావర్తదేశంబు, కా
రవ మా క్షేత్రము క్షాత్రయుద్ధపిశునప్రాంతంబు సేవింపు, గాం
డివి మున్నెచ్చట రాజవక్త్రముల ముంచెన్ బాణవర్షంబునన్
దివురన్ వారిరుహాళిపైఁ గురియఁ బోల్ నిన్ బోలి శంపాపతీ.
48

హాలను రేవతీసునయనాంకిత నిష్టరసన్ ద్యజించి, యా
హాలముదాల్పు బంధురతి నాజిపరాఙ్ముఖతన్ వహించి, తా
నోలి భజించె నే ఝురి శుభోదక మీవును నా సరస్వతిన్
వాలుచు నాత్మశుభ్రతఁ గనం గదె, కార్ష్ణ్యము వర్ణమాత్రమై.
49

కనఖల మేగు మంత, నటఁ గన్గొను కొండల తేని డిగ్గు జ
హ్నుని సుత, సాగరుల్ త్రిదివ మొందఁగ నెక్కెడు మెట్ల
పంక్తినిన్
కనుబొమలన్ ముడుంచు గిరినందననున్ నురువార నవ్వి శం
భుని సిగ బట్టె నా నది తమోనుదలగ్నతరంగహస్తయై.
50

అమరగజంబు వోలిక వియత్తలి బ్రేలఁగ వెన్నగంబు నీ
వమరిన తిర్యగాయతి సితామలసుస్ఫటికోపమాంబువుల్
తమి గ్రహియింప, గంగ మఱి తత్ క్షణమే ఝరిఁ బర్వ నీడు బిం
బము కలిమిన్ రహించు వెడపట్టునఁ గూడె ననాఁ గళిందజన్.
51

పావనగాంగకారణము పర్యుపవిష్టకురంగనాభిగం
ధాన్వృతగండభాగము హిమామలగౌరమహీధ్ర మొందుమా;
నీవు పథిశ్రమం బెడల నిల్చుచు నా నగశృంగమందు శో
భావహి నాదు నయ్యు శివవాహవిదారితపంకసామ్యతన్. 52

ఊప్పుం జోసిదు గాలిలో సరళకాండోద్ఘట్టజల్ నిప్పుకల్
బ్రాసింపన్, దవదాహ మేచి చమరీవాలోచ్చయం బేర్చ, ధా
రాపాతప్రతతిన్ సమగ్రముగ నార్పన్ దాని నాఘ్యుండ వి
నాపన్నార్తినివారణార్థములు సుమ్మా యార్యసంపత్ స్థితుల్. 53

సరభస ముప్పరం బెగసి చయ్యన నిన్ దదతీతమార్గగున్
శరభము లాగిరిన్ గడిచినన్ వికలావయవంబు లౌచు, నీ
పురవడి వ్రేయు వానిఁ గరకోపలసంకులవృష్టి, నెట్టిరుం
దొరకొని నిష్ఫలార్థములు దూపిల రే పరిహాసపాత్రులై. 54

ఒక శిలపైని నటన్ గల దహో శశిమౌళి పదాంక, మెప్డు దా
నికి బలిఁ గూర్తురు సిద్ధులు, వినిర్మలభక్తిఁ బ్రదక్షిణింపుమా;
ఒక పరి శ్రద్ధధాను లదియుం గనిరేని నివృత్తపాపులై
వికరణు లౌటతో ననుభవింతురు శాశ్వతమౌ గణాస్థితిన్. 55

శ్రుతిసుభగం బొనర్పఁగ మరుత్తులు కీచకపూరకంబు, లా
తతముగఁ బాడఁగాఁ ద్రిపురదాహకగీతిని కిన్నరాంగనల్,
ప్రతిరవ మీనుచున్న గుహలన్ మురజధ్వని సల్పవయ్యె, నా
వృత పశునేత కయ్యెడఁ బ్రపూర్తిగ నర్తనగీతవాద్యముల్.
56

హిమగిరి చెంగటం గల యహీనవిశేషము లోలి దాటి, పో
వుమ భృగువంశ్యకీర్తిపథమున్ గలహంస పదంబు క్రౌంచరం
ధ్రమున నుదీచి దిక్కునకుఁ, దాలిచి తిర్యగనల్పదైర్ఘ్యమున్;
బ్రమదమునన్ వహింపు బలిబంధనవిష్ణుపదోపమేయతన్.
57

లలి నూర్ధ్వంబుగ నేగి విందగుము కైలాసాద్రికిన్, నిర్జరీ
విలసద్దర్పణ మద్ది, పంక్తిముఖదోర్విశ్లేషితప్రస్థసం
ధులు గల, దంబరం బలము తత్ శుభ్రోజ్జ్వలోచ్ఛృంగముల్
హాలయున్ ద్ర్యక్షమహాట్టహాసములు ప్రోవుల్ చేరె
నిత్యంబనాన్.
58

నీ వలరంగ సానువున స్నిగ్ధవిమర్దితకజ్జలచ్ఛవిన్
తా వెలయు న్నగంబు కరిదంతపుఁ గోతల క్రొత్త తెల్పుతో
గేవల మల్ల సీరి భుజకీలితమేచకవస్త్రధారి సొం
పా వహిలుం బలెన్, దలఁతు నాత్మ నచంచలదృగ్విలోకస్యమై.
59

శర్వుఁడు పాఁప కైకడెము జార్చి యిడం గయిదండ, నాగిరిన్
బార్వతి సల్పుచో విహరణంబులఁ గాల్నడ, నగ్రయాయినై
సర్వరసౌఘ ముల్లమున స్తంభితముం బొనరించి, భక్తిమై
పర్వవిభక్తిఁ బర్వుమ భవద్వపువున్ మణిసాను వెక్కఁగన్.
60

ఆ గిరి సౌరబాలలు సఖా నినుఁ గంకణకోటిఁ గొట్టుచున్
వేగమ నీరు చిమ్ముకొని వెల్వడ నిన్నుఁ బొనర్తురు యంత్రధా
రాగృహ మట్లు, వేసవిని బ్రాప్తిలు ని న్విడరేని, వీనులన్
వ్రేగగు గర్జ లూని వెఱపింపుమ కేళివిలోలచిత్తలన్.
61

హైమసరోరుహాస్పదము లానుచు స్వచ్ఛమనస్సరోంబువుల్
మోమున మొహ్మ లారు తనుపున్ సురహస్తి కొసంగుచున్
క్షణం
బామర శాఖినిన్ గిసలయాంశుకముల్ వలిగాలి నార్చుచున్
నీ మది కింపు నింపు రమణీయపుఁ జెయ్వులఁ జల్పు మగ్గిరిన్.
62

జానగు నేది కొండయొడి జాఱు వియన్నది పట్టు పైటతో
దాని నెఱుంగవే యలక, తాల్చు జలోత్సృజదభ్రపాళిఁ బెం
పైన నిజాలకాళిఁ జెలువారెడు మౌక్తికజాలకమ్ములుం
గా, నిభృతోద్విమాన యది, కామచరా, భవదీయ వేళలన్.
63

రామలు చిత్రముల్ మురజరావములున్ మణిభూము లొప్పఁగా
వ్యోమలిహాగ్రముల్ వెలయుఁ బ్రోలున దేవగృహంబు లోలి సౌ
దామని యింద్రచాపము నుదాత్తసుఘోషము నంతరంబు లే
పౌ మహిమోన్నతున్ నిను ఘనా సరిబోలుచు
హంగులన్నిటన్.
64

చెలువల కెప్పు డప్పురిని జెల్వగుఁ గేలను గేళితమ్మి, కుం
తలముల బాలకుందసుమదామము, లోధ్రపరాగపాండుతా
కలన ముఖంబునన్, గురవకంబు కచంబునఁ, గర్ణసీమఁ బే
శలమౌ శిరీషమున్, ద్వదనుసంభవనీపసుమంబు పాపటన్.
65

* తరువులు నిత్యపుష్పము లుదంచితమత్తమధువ్రతధ్వనుల్
సరసులు నిత్యపద్మములు సక్తమరాళకదంబకాంచికల్
భరితరవోద్గళల్ భవనబర్హులు నిత్యలసత్కలాపు ల
ప్పురమున, యామినుల్ హృతతమోభరరమ్యలు నిత్య
కౌముదుల్.

* హరుసము చేత దక్క నయనాంబువు పుట్టదు వేఱ్కతంబునన్
దొరయదు తాప మిష్టయుతిఁ ద్రోయఁగ నౌ స్మరజంబు దక్కగన్
విరహపదంబునుం గలుగ నేరదు నెయ్యపుఁగిన్క గాక, లే
దొరువయసైననుం బరువ మొక్కటి గాక యక్షకోటికిన్.

రిక్కల చాయ పూవుల నెఱిం గల స్వచ్ఛమణిస్థలంబులన్
నెక్కొని, కాంతలం గలిసి, సిద్ధపు మేడల యక్షపుంగవుల్
చక్కని శీధువా రతిఫలంబు గ్రహింతురు కల్పజాతమున్
ఢక్కల మ్రోతఁ లార నట డంబుగఁ ద్వత్కలగర్జితాభముల్. 66

*సురనదినీటి తెమ్మెరలు చోఁపు లొసంగుచుఁ గొల్చుచుండ, న
ద్దరిఁ గల యావిమ్రానుగమి దట్టపు నీడలు వాప నెండ, న
ప్సరము కుమారికల్ దివిజమోహిను లాటల నాడుచుండు ర
క్కఱఁ బిడికిళ్లఁ బైడియిసుకం గొని గూఢమణిప్రసక్తలై.

విరియ భవన్నిరోధము, ప్రవేశిల నిర్మలచంద్రపాదముల్
కరగిన తంతుజాలపరిలంబితచారుతరేందుకాంతముల్
దొరఁగెడు నీటి తుంపురులు త్రోయు రతాంతజమంగఖేదమున్
దరుణుల కర్ధరాత్రి శ్లథితం బొనరింపఁగఁ గొఁగిలిన్ వరుల్. 67

ప్రేరకుఁ డౌ సదాగతి పురిన్ భవనాగ్రతలాంతరంబులన్
జేరిచినంత, నానిచి సుచిత్రపటాళి స్వశీకరంబులన్
వారిధరుల్ భవాదృశులు వైళమ ధూమవినిర్గమానుగో
ద్గారులు నిష్క్రమించెదరు త్రాసమునం బలె జాలమార్గులై. 68

సడలువడంగఁ బోకముడి జాఱిన వల్వ వడంకు కేలఁ దా
రొడిచికొనంగ నేయురు సముత్సుకతన్, లలితాంగు లెక్కు-డున్
బిడియము చేత బేలలయి, నేఱుగఁ జల్లియుఁ జూర్ణముష్టి, పై
కడరెడు కాంతు లగ్గలములౌ మణిదీపము లార్ప లేరటన్. 69

.

* పెన్నిధు లక్షయంబులుగ వీట నెసంగు విలాసు లప్సరిన్
జెన్నుగ నప్సరోంగనలఁ జేకొని నిత్యము రక్తకంఠసం
పన్నులు కిన్నరుల్ ధనదు ప్రాభవమున్ బయి స్థాయిఁ బాడ సౌ
ఖ్యోన్నతిఁ జొక్కు-చుందురు పురోపగచైత్రరథోల్లసద్వనిన్.

పురి నభిసారికల్ నిసిని బోయిన మార్గము బైటవేయు భా
స్కరు నుదయాన, ముంగురుల జాఱిన కల్పసుమాళి, చెక్కి-లిన్
దొరఁగిన పత్త్రఖండములునుం, జెవి రాలిన పైడి తామరల్
భరమగు చన్గవం బెరిగి వ్రాలిన పేరులు ముత్తెపున్సరుల్. 70

ధనపతి నెచ్చెలిం దలఁచి దాపునఁ గాపుర మున్న దేవునిన్,
ధనువును షట్పదజ్యమును దాల్పఁడు పూవిలుకాఁడు ప్రాయికం
బనువుగఁ దీర్చుఁ దత్కృతి నొయ్యారిపడంతుల బొమ్మమోడ్పువిం
డ్లును నునుజూపుతూపుగములున్, వితవోనివి కామి నేయఁగన్. 71

* వలువలు వన్నెవన్నెలవి, స్వర్ణమణిప్రవిభూషణంబులున్
కలితకిసాలముల్ వలపు గ్రమ్మెడు పూవులు, పాదసీమఁ జే
శలముగఁ బూయ యావకము, చాక్షుషవిభ్రమబోధిశీధువున్
చెలువల కెల్ల ధార్యములు సిద్ధిలుఁ గల్పక మేక మీనుటన్.

నీరద, నా గృహంబు గన నేర్తు ధనేశు నగళ్ళ కావలన్;
దూరమునందె గుర్తు వడుఁ దోరణ మింద్రధనుఃప్రకాశమై;
చేరువ లోఁగిటం గలదు చెల్వకుఁ బెంపుడు బిడ్డ బాల మం
దారము చిక్కఁ బూచుట నతంబయి చేతులకందుగుత్తులై.
72

తనరును బావి సన్మరకతంబులఁ దీర్చిన మెట్ల కట్టుతో;
కనకసరోజముల్ జలము గప్పు విడూరజనాళయుక్తముల్;
అనువుగ హంసలందు నిలయంబమరన్ నినుఁ జూచియున్ వెతన్
గొన విసుమంత, మానసమునుం దలపోయవు సన్నికృష్టమున్.
73

సవిధమునందు కేళిగిరి జంభరిపూపలశృంగజాలమై
మివుల మనోజ్ఞమై యలరు మేల్మి యరంటులు చుట్టు నున్నదై;
చవు లెసఁగించు మించులయి సాంద్రపరీవృతి గల్గు నీవు క
న్దవిలియు, జంకుచుం దలఁతు దానిన మద్గృహిణీప్రియంబనా.
74

అందం బయ్యెడి నందు గోరటలు వెల్గా మాధవీమంటపం
బందే క్రేవలఁ గ్రొంజివు ళ్లడరు రక్తాశోకముం గేసరం
బం దేకం బల చెల్వ వామపద మత్యంతంబు నన్బ్రోలెఁ గో
రుం, దక్కొక్కటి వక్త్రశీధువును గోరున్, దోహదవ్యాజతన్. 75

వానికి మధ్య లేవెదురు వన్నె మణుల్ బఱపా వితర్దికన్
బై నుఱు వాసదండము సువర్ణము స్ఫాటికపీఠికాగ్రమై;
తాన సకంకణక్వణనతాళము నా చెలి గొల్వ, నృత్యమున్
జానుగ జల్పి నీదు చెలి సంజఁ గలాపి యటన్ గుదుర్కొనున్. 76

చెప్పిన లక్షణంబు లివి చిత్తమునం దిడి, చూచి ద్వారమం
దొప్పగు శంఖపద్మముల నుల్లిఖితంబులఁ బార్శ్వసీమలం
దిప్పుడు మద్వియోగరుచిహీనము గేహ మెఱుంగు, మర్త్యుఁడున్
దప్పిన వేళ నాత్మరుచిఁ దామర తాల్పదు గాదె విజ్ఞుఁడా. 77

త్వరితగతిం జొరంగఁ గలభంబు వలెన్ గొని రూపు సానుసుం
దరము మదుక్తకేళిగిరిఁ దార్గొని కూర్చొని సానుకూలతన్
స్ఫురితతటిద్విలోకనము జొన్ప మిడుంగుఱు గుంపు కాంతితో
సరిగఁ దళుక్ తళుక్కున విశాంతము లోపలికిన్ బయోధరా. 78

సన్నని మేను, మొగ్గనరుసల్ రదముల్, నెఱిదొండ మోవి, కా
నున్నదొ లేదొ, త్రస్తమృగియుంబలెఁ జూపు, గభీరనాభియున్,
చన్నుల పేర్మి నమ్రత, విశాలకటిన్ గతిమాంద్య మొప్పఁగాఁ
జెన్నగుఁ జామ, ధాత తొలి శిల్ప మనా జవరాండ్ర సృష్టిలోన్.
79

అనుఁగు సఖుండు దూరగతుఁ డౌటయు నొంటరి చక్రవాకి య
వ్వనిత నెఱుంగు మన్న మితభాషిణి నా దగు మాఱు
ప్రాణమున్;
మనమున నెంతుఁ బెన్వనట మానిని యీ నిడుపుం దినంబులన్
గన నగు మాఱు రూపు గొనెనా శిశిరాహతపద్మినిం బలెన్.
80

ఊరక యేడ్చు చున్కి కను లుబ్బి, భరం బగు వేఁడి వేఁడి ని
ట్టూరుపు వాళి చేత నధరోష్ఠము చాయ దొఱంగి, ముంగురుల్
జాఱుచు నావరింప నలజాటయి, కేలను వ్రాల్ కపోలమై
ఆ రమణీముఖంబు భవదాక్రమితేందునిఁ బోలు విన్ననై.
81

పూజలు సేయుచైనఁ, దలపోసి వియోగకృశంబు నాదు రూ
పౌజ లిఖించుచైనను, పయోజనిభానన, పంజరంబునన్
భ్రాజిలు తీపులాడి గోరువంకను దువ్వుచు 'సామి నీ పయిన్
మోజు గలాఁడటే, తలఁతువో సరసా' యనుచైనఁ దోఁచెడిన్
82

ఒడి మలినాంబరంబు పయి నుంచి విపంచి మదీయనామ మే
ర్పడ విరచించుకొన్న కృతిఁ బైస్వరమందునఁ బాడఁ గోరుచున్
తడుపఁగఁ దీగ నశ్రుజలధార యెటో తడి వుచ్చియుం బదం
బడి నిజకల్ప్యమూర్ఛనను బల్మఱు నేమఱు చైనఁ దోఁచెడిన్
83

అల దిన మాది గాగ విరహావధికిన్ మివు లున్న మాసముల్
లలన గణించు చుండునొ యిలం గడపం గల పూలు బెట్టుచున్
కలయికనున్ భజించుచునొ గ్రాలు మనోనిహితోద్యమంబునున్
నెలఁదులకున్ వియోగమున వేడుక లిట్టివ బ్రాయికంబుగన్.
84

పనివడి యునికి నిట్టులు పవల్ విరహం బది వేఁప దంతగా
ఘనతరదుఃఖగాఁ దలఁతుఁ గాంతను రాత్రుల నిర్వినోదగా
వినిచి మదీయవార్తలను బ్రీత నొనర్పు నిశాంత జాలకం
బెనసి నిశీథి, సాధ్విఁ గన వే యవనీశయనన్ వినిద్రనున్.
85

చిక్కి మనోవ్యథన్ వియుతి సెజ్జను నొత్తిగిలం బరుండి, తా
నొక్కటఁ దూరుపుం జివర నున్నెల నేకకళావశేషనున్
జక్కఁగఁ బోలు, రే గడపు-నన్ గవ గూడి రమింప నిచ్చ ము
న్నొక్క క్షణంబు, నిప్డు విరహోచ్ఛ్రితదీర్ఘము -వేఁడి
యశ్రులన్.
86

జాలముఖాగతంబు లగు చారుసుధాశిశిరోదయేందు పా
దాళికిఁ దాఁటి ప్రీతి నెదురారి యటే వెనుమళ్లు చూడ్కి నా
బాలిక యప్పళించుకొని పక్ష్మములన్ భరితాశ్రుపంక్తులన్
పోలును దుర్దినాహ్నమున మూయని విచ్చని నేలతామరన్.
87

గఱుకయి వట్టితానమున• గండతలాంతము వ్రేలు ముంగురుల్
నెఱపుచు నుండుఁ గాంత నెఱినిన్ బెదవిం జివు రేర్చు
నూర్పులన్;
కొఱలు నదెట్టులో కలియఁ గూడుట నన్ గలనైన నంచు, న
క్కఱ పడుచుండు నశ్రువుల కాల్వలు మార్గము నడ్డు నిద్రకై.
88

అలరుల దండ వాని విరహాద్యదినంబునఁ గొప్పు నెట్ట, మి
క్కిలి బిరుసెక్కి పోకునకుఁ గ్లిష్టమునన్ విషమంబు నేకమై
నలుగుడు తీఱి శాపము కొనన్ ముడి నే దివ నైన వేణిఁ జె
క్కిలి పయిఁ బెచ్చు గోళ్ళయిన క్రేగయి వేమఱు బాల
త్రోసెడిన్.
89

అ య్యసహాయ త్యక్తసకలాభరణం బగు పేశలాంగమున్
శయ్య పయిన్ మహార్తి మెయి సారెకు వ్రాల్చుచు నెట్టులెట్టులో
వ్రయ్యక యుండు, నోర్తు నవవారిముచాశ్రు లవశ్య మీవు నో
నెయ్యుఁడ, జాలిచేఁ దఱచు నీరయి పోదురు సార్ద్రచేతసుల్.
90

నా యెడ నింపు కూరిమి మనస్వినికిం గల దే నెఱుంగుదున్,
పాయుట తొల్త, నీ క్రియన వర్తిలు చున్నది గాఁ దలంతు, నే
మో యిటు హెచ్చులాడఁ గద మోహనమూర్తి నటన్న
భ్రాంతితోఁ;
నా యని నట్టి దెల్లను గనం గల వీ వచిరంబ తమ్ముఁడా.
91

అలక లపాంగవిస్ఫురణ మాఁక యొనర్ప సురానవాప్తి భ్రూ
విలసన లెల్లనున్ మఱచి, పెట్టమి కాటుక జిడ్డు వోయి, యా
లలితమృగాక్షి నేత్రము కలంగుచు నూర్ధ్వమునన్ స్ఫురించు నీ
వాలయఁగఁ, జేపలుం గలఁప నొయ్యఁ జలించెడు గల్వ
సొంపుతోన్.
92

నా కరజక్షతంబులు వినా, విడనాడి చిరానుభూత ము
క్తాకటిసూత్రమున్ విధివిధాయకతన్, సురతాంత వేళ ము
న్నాఁ కయి నొత్తుటల్ గనిన నాయిక డాఁతొడ సంచలించెడున్
గాక, రసార్ద్రిమా నరఁటి కంబము వోలిక గౌరభాసమై.
93

అంతట లబ్ధసుప్తిసుఖయై సఖి యున్నఁ, బయోద, రావ మా
వంతయుఁ జేయ కాఁగి యొక యామము మాత్రము వేవు, మెట్టకే
గాంత కలన్ ననుం గవయఁగా బిగికౌఁగిట, నంతలోన స
ల్లింత వహింప కుండుత సలీల మెడం బెనగొన్న కైలతల్.
94

చెన్నగ మేలుకొల్పుచు స్వశీకరశీతలవాతవృత్తి నా
యన్నను దేర్పుమా నవనవాంచితజాతిసుమాళి తోడ, నీ
వున్న గవాక్షమా మెగను నూరక నిశ్చలదృష్టి, నీవు ధై
ర్యోన్నతిఁ బల్కఁ బూను స్తనితోక్తులతోఁ దటిదంతరుండవై. 95

ఐదువరాల, నీ మగని కాప్తసఖుండను, వారివాహుఁడన్,
నీ దరిఁ జేరినాడ నెద నిల్పి తదీయవచస్సు లమ్మ, నే
గాదె గభీరతామధురగర్జలచేఁ బథి వేగిరింతు నెం
తే దయితైకవేణి విడఁదీయఁ దమిం గొను పాంథబృందముల్. 96

నీ విటు లాడ, వాయుసుతునిన్ జనకాత్మజ వోలె, నిన్ను నా
దేవి ముఖాబ్జ మెత్తి కను; దేటి యెదన్ దమి సత్కరించు ని,
న్నావలి దెల్లనున్ విను ననన్యమతిన్, సుహృదాప్త మైన చే
తో విభు వార్త సంగమముతో సరి నెంత్రు వధూటులో సఖా. 97

నే నిటు సేయు విన్నపము నీదు పరోపకృతిప్రవృత్తి యెం
తేని ఫలింపఁ బల్కు మిది —నీ సహవాసి సజీవుఁ డాశ్రమ
స్థానగుఁ డొంటి రామగిరిఁ దా నిటు లారయు నీదు క్షేమమం
దా నిదె పో విపత్సులభ లైన జనంబుల కాదు తొల్నుడుల్. 98

చిక్కి తపించి యశ్రువులఁ జిల్కుచు నూర్చుచు గాటపుందమి౯
స్రుక్కు త్వదంగకంబున ననూనమనోరథకోటి చేతఁ దాఁ
జిక్కి తపించి యశ్రువులఁ జిల్కుచు నూర్చుచు గాటపుందమి౯
స్రుక్కు నిజాంగముం గలుపుఁ గ్రూరవిధిప్రతిరుద్ధమార్గుఁడై
99

•

వెల్లడి మాట యైనఁ బెదవిం జెవి జేర్చి రహస్య మాడు నీ
సల్లలితాస్య మంటు సరసంపుఁ దమి౯ జెలి పిండు ప్రోల ము
న్నల్లవి వాఁడు నేడు చెవి కందక, కంటికిఁ గూడ దూరమై
యి ల్లలిఁ బల్కు నిన్ను వగ లీను వచస్సుల మన్ముఖంబున౯.
100

తనువు ప్రియా ప్రియంగువులఁ ద్రస్తవనైణివిలోలవీక్షణం
బున నునుజూడ్కి, జాబిలిని మోము వికాసము, బర్హిబర్హపు౯
జెనుపున వేణిఁ, గన్బొమల నీటును శైవలినీ తనూర్మిక౯
గనుగొను వాఁడ, నొక్క యెడఁ గానను నీ సరి నెందుఁ గోపనా.
101

గైరికధాతురాగమున గండతలంబున నిన్నుఁ దీర్చుచు౯
గూరిమి కిన్క గొన్నటులు, కోరుదుఁ ద్వచ్చరణార్పితాంగునిం
గా రచియింప నన్నువిద, క్రమ్మి పయింబయి నశ్రు లంతఁ బో
కారుచుఁ జూడ్కి, దుర్విధి కటా మన కూటమి సైప దట్లున౯.
102

ని న్నెటులో కలం బడసి నెమ్మిని గుమ్మి గవుంగిలింప బా
హూన్నయనంబు సేసి బయ లూడుచు న న్గనినంత జాలి పై
గొన్న స్థలీదివౌకసులకున్ వెలివాఱు నవారితాశ్రువుల్
చెన్నగుఁ జెట్లఁ గెంజివురు చిప్పలఁ దోరపు ముత్తెపున్సరుల్.
103.

క్రొత్తగ దేవదారు చివురుం బుటముల్ జిటిలించి, వానిలో
జొత్తిలు పాల యోడికల చొక్కపు తావి గ్రహించి, దక్షిణం
బత్తఁగ వీచుచో, మును త్వదంగక మోలి స్పృశించి వచ్చు నం
చొత్తుగఁ గాఁగిలింతుఁ జెలిరో హిమవన్నగ మారుతౌఘముల్.

* ధారాసిక్తవసుంధరాపరిమళాత్తత్వన్ముఖ శ్రీకి నే
దూరీభూతుఁడనై కృశించినను నన్ దూలించుఁ బంచాస్త్రుఁ, డే
తేరన్ వర్ష, ఘనాఘనంబు లలమన్ దిక్సీమ, లర్కాంశువి
స్తారం బైన దినంబు లెట్లు సకియా సాగింతునో చెప్పవే.
104

తీఱుత క్షణంబుగఁ ద్రియామ దీర్ఘయామ
పవలు లేయెండయై యొప్పు పరఁగుఁ గాత
మంచు నా యెద దుర్లభార్థార్థి యాఁచు
క్రాఁగు విరహార్త్తియై రక్షఁ గాన లేక.
105

పరిపరిభంగులన్ బ్రణయభావన సేయుచు నిల్పుకొందు నో
తరుణి మదీయజీవములఁ, దద్ద దిగుల్ శుభలక్షణాంగి నీ
వారయకు, మేరికైన స్థిరమున్నె సుఖంబును దుఃఖ మేని, గ్రిం
దరుగును బైకిఁ బోవును గదా దశ జీవికిఁ జక్రనేమి నాన్.

106

శాపము నాకుఁ దీఱు ఫణిశయ్యను మేల్కొని నంత శౌరి, నీ
వోపిక పట్టి నాల్గు మివు లున్న నెలల్ కనుమూసి పుచ్చుమా
పై పయి నిష్ఠ తోఁచు స్పృహావార మవశ్యము దీర్త మీావు నే
నా పయి శారదేందువిభవాతిశయాంచితయామినీతతిన్.

107

నాఁ డొకసెజ్జ నిద్దురిలి నా మెడ నీ భుజవల్లి నల్లి, నీ
వేడుచు చేలా మేలుకొని, యెందుల కే యని యెంత యేని నే
వేడుకొనంగ, లోనగవు వెల్వడ నీయక, 'మోసగాఁడ వి
క్రీడలఁ దేల్చు చొక్కు కొమిరేన్ గలఁ దోఁచితి' వంచుఁ బల్కవే.

108

దీనిన యూనవాలు గొను, దీన నెఱుంగు ననున్ సుభద్రుఁ, గా
లీనము చేత నన్గుఱిచి, లేని యపోహల పాలు గాకుమా;
ఊన మటందు) చెల్మ లెడ యున్న, నదేటి జనోక్తి, యిష్టవ
స్త్వనుభవాతిరిక్తత రసాధికసంభృతిఁ బ్రేమరాసులౌ.

109

*తొలి విరహంపు నెవ్వగలఁ దోఁగెడు నీ చెలి నిట్లు తేర్చి, యా
య్యలికపు గంటి వేల్పు వృష మాటలఁ గ్రుమ్మెడు కొమ్ము లారు గ
ట్టలయక వీడి, తత్కుశల మందిడి నా కిట నానవాలుతో
నిలుపుము నాదు జీవమును నీ వరుణోదయ జీర్ణకుందమున్.

పనిపడి త్రోయి, సౌమ్య, నలుపన్ వెనువెంటనె బంధుకార్య మి
య్యనువున, మాఱు పల్కవు గదా, యది నీఁదగు ధీరవృత్తి, యొం
దును నిను వేడ నిఃస్వనముతో జల మీయవె చాతకాళికిన్;
ఘనులకు యాచకప్రణయకార్యము తీర్చుటె మాఱు పల్కుటౌ. 110

నా పయిఁ బ్రీతినో, విరహి నన్ గృపచేతనొ, సానుభూతినో
నా పరమప్రియం బిది ఘనా తగ వారయ కీవు తీర్చి, వ
ర్షాపరిపూర్ణశోభ నలరారి నిజేచ్ఛఁ జరింపు దేశముల్;
ప్రాపిల కుండుతన్ ద్రుటిఁ గళత్రవియోగము నీకు నా వలెన్. 111

* ఆ సందేశముఁ జెప్పి దివ్యకలవాగారూఢి మేఘుండు వి
శ్వాసం బేర్పడు నట్లు యక్షిణికిఁ దత్ప్రాణావనోద్యోగి, యొం
తో సంతోషము నొందె నామె నిజభర్తృవృత్తాంతమున్ విన్నదై
యే సామర్థ్యన యే నభీప్సితఫలం బొందైనఁ గాకుండునే.

* ధనపతియున్ శ్రుతిప్రియకథన్ వినినంతన మేఘదౌత్యవార్తను, గతకోపుఁడై, కనికరంబున శాపసమాప్తి జేసి, వెంటనె జతగూర్చె వారి నొకటన్ హృతశోకుల హృష్టచిత్తులన్; దనియఁగఁ జేసె నిష్టసుఖతత్పరులన్ జరితార్థజీవులన్.

035,1D40
N58
R.S. VIDYAPEETHA LIBRARY
TIRUPATI



Vivekananda Press - Nellore.

VERIFIED-2001

R.S. VIDYAPEETHA LIBRARY * TIRUPATI *
55568